

ఆశాలకు కనీస వేతనాలు అమలు చేయాలి

మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి డిమాండ్


మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి- ఐరాల

ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ చిత్తూరు ఆరవ జిల్లా మహాసభ ఆదివారం కాణిపాకంలోని ఎస్వి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో యూనియన్ నాయకులు సుబ్బలక్ష్మి, సావిత్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి హాజరై మాట్లాడారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే ఆశాలకు కనీస వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అన్ని రకాల వైద్యసేవలు అందించడంలో ఆశా కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారని ఇలాంటి ఆశాలపై చిన్నచూపు తగదన్నారు. గత 20 సంవత్సరాలు కాలంలో అనేక పోరాటాల ఫలితంగా రూ.10వేలు వేతనం సాధించడం జరిగిందని ఇంకా అనేక రకాల సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఆ సమస్యలు పరిష్కారం కోసం కూడా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో అధికారులు సంబంధంలేని పనులన్నీ ఆశా కార్మికుల దగ్గర చేయించడం దారుణమన్నారు. ఆశల ప్రధాన పని ఇంటింటికి తిరిగి వైద్య సలహాలు అందించమని, ఆ పని చేయకుండా ఏఎన్ఎంల పని, హాస్పిటల్ పని చేయించడం, అంతేకాకుండా పింఛన్లు ఇచ్చే కార్యక్రమాన్ని కూడా చేయించడం ఏమిటని ప్రశ్నించారు. రక్త పరీక్షలు టీబీ పరీక్షలు, ఎయిడ్స్ పరీక్షలు వంటివి ఆశలు దగ్గర చేయించరాదని కానీ జిల్లాలో మెజార్టీ పిహెచ్సీలలో చేయిస్తూ ఓపి డ్యూటీలు వేయించడం, రాత్రిలలో డ్యూటీలు వేయడం జరుగుతోందని దీన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. మన రాష్ట్రంలో మొట్టమొదటిసారి విశాఖపట్నంలో సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు డిసెంబర్ 31 జనవరి 4 వతేదీ వరకు జరుగుతున్నాయని ఈ మహాసభల్లో చిత్తూరు జిల్లా ఆశ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి గిరిధర్ గుప్తా, జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు, అంగనవాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షకీలా, వీఓఏల ప్రధాన కార్యదర్శి శ్రీధర్ బాబు, 108 ఉద్యోగుల యూనియన్ జిల్లా కార్యదర్శి శివలు మద్దతుగా పాల్గొని మాట్లాడారు. ఆశాలపై అధికారులు పని ఒత్తిడిలు మానుకోవాలని డిమాండ్ చేశారు. అదనపు పనులు పూర్తిగా రద్దు చేసి ఆశలకు వేతనాలు పెంచాలని కోరారు. ఆశ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగ కార్యదర్శి నివేదికను ప్రవేశపెడుతూ గత మూడు సంవత్సరాలలో చేసిన పోరాట అనుభవాలను వివరించారు. మహాసభ ప్రారంభానికి ముందు జెండా ఆవిష్కరణ చేసి ఇటీవల మరణించిన నాయకులకు నివాళులర్పించారు. ఈమహాసభలో యూనియన్ జిల్లా నాయకులు రూబీ, లక్ష్మి, వనజాక్షి, ఆశ కార్మికులు పాల్గొన్నారు.


సభకు హాజరైన ఆశా కార్మికులు

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఈనెల 8వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో 8వ తేదీ సోమవారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్ సెల్..

చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్' (ప్రజల ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం) 8వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు పాత డీపీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ అధికారులకు నేరుగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 8వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు నగర పాలక సంస్థలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కర వేదికను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ నరసింహ ప్రసాద్ కోరారు.

కుప్పంలో పిజిఆర్ఎస్ వాయిదా..

కుప్పం: కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసం 8వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు కడా పీడీ వికాస్ మర్మత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాలవల్ల ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని వాయిదా వేయడం జరిగిందని వచ్చే సోమవారం యథావిధిగా పిజిఆర్ఎస్‌ను నిర్వహించనున్నట్లు పీడీ తెలిపారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నిత్య అన్నదాన ట్రస్ట్‌కి విరాళం

ప్రజాశక్తి- ఐరాల: శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం నిత్య అన్నదానం ట్రస్ట్‌కి విరాళంగా 1,00,335లు చెక్కును దాత రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి అందజేశారు. ఆదివారం తెలంగాణా రాష్ట్రం యాదాద్రి భువనగిరి చెందిన రాజేంద్ర ప్రసాద్ రెడ్డి టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడుకి విరాళం చెక్కును అందజేశారు. అనంతరం దాతలకు స్వామివారి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.


చెక్కు అందిస్తున్న దాతలు

డీకే బద్రీనారాయణ మృతికి ఎమ్మెల్యే నివాళి



ప్రజాశక్తి- పలమనేరు: జిల్లాకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త డీకే.బద్రీ నారాయణ మృతి పట్ల పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డి సంతాపాన్ని తెలియజేశారు. చిత్తూరు మాజీ ఎంపీ డీకే ఆడికేశవులు నాయుడు సోదరుడైన డీకే. బద్రీ నారాయణ శుక్రవారం ఆకస్మికంగా మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చిత్తూరులోని వారి స్వగృహానికి చేరుకొని ఆయనకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. పారిశ్రామిక, రాజకీయ రంగాలలో ఆయన చేసిన అలుపెరుగని సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. వారి కుటుంబీకులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. ఎమ్మెల్యేతో పాటు సీనియర్ నాయకులు వసంత కుమార్ ఉన్నారు.

దేవాలయం కూల్చివేతపై పోలీసులకు ఫిర్యాదు



ప్రజాశక్తి- శాంతిపురం: మండల పరిధిలోని సి.బండపల్లి గ్రామంలో సుమారు 300 సంవత్సరాల పురాతన దేవాలయాన్ని అదే గ్రామానికి చెందిన కొందరు ఆదివారం కూల్చివేశారు. దీంతో గ్రామస్తులు రాళ్ళబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలు.. ప్రస్తుతమున్న దేవాలయాన్ని గ్రామస్తులందరూ కలిసి రూ.20 లక్షలతో పునర్ నిర్మాణాన్ని చేయాలని అందుకు తగిన ఏర్పాట్లు చేశారని, అంతేకాకుండా ప్రభుత్వం తరపున కూడా దేవాలయ నిర్మాణానికి రూ.25లక్షలు మంజూరుకుగాను ప్రతిపాదనలు పంపి సంబంధిత అధికారులు కూడా ఆలయ నిర్మాణానికి సర్వేలు నిర్వహించినట్టు తెలిపారు. ఇది ఇలా ఉండగా గ్రామంలోని కొందరు వారి స్వార్ధ రాజకీయాల కోసం గ్రామపెద్దలను సంప్రదించకుండా వారి సొంత నిర్ణయంతో దేవాలయాన్ని ఆదివారం జేసిబితో కూల్చినట్టు తెలిపారు. ఈ సంఘటనను గ్రామపెద్దలు గ్రామస్తులు తీవ్రంగా ఖండిస్తున్నారని, దేవాలయాన్ని కూల్చిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

20 మంది విద్యార్థులను చితకబాదిన ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - ఓజిలి : తిరుపతి జిల్లా, ఓజిలి మండలం, వాకాటివారికండ్రిగ, ఆదర్శ ఏకలవ్య గురుకుల పాఠశాలలో కొంతమంది ఉపాధ్యాయులు విలువలు మరిచి విచక్షణ రాహితంగా ప్రవర్తిస్తూ, గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తికి కళంకంగా మారుతున్నారు. చిన్నపిల్లలని కూడా చూడకుండా ఒక్కరిద్దరు చేసిన తప్పిదానికి కోపోద్రిక్తుడైన ఒక ఉపాధ్యాయుడు హాస్టల్‌లోఉంటూ చదువుతున్న పిల్లలందరినీ చితకబాదిన సంఘటన గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. ఏడవ తరగతి చదువుతున్న 20 మంది విద్యార్థులను డ్రిప్ పైపుతో ఓ ఉపాధ్యాయుడు చితకబాది పిల్లలను గాయాల పాలు చేశాడు. ఆదివారం విద్యార్థులను చూసేందుకు వచ్చిన వారి తల్లిదండ్రులకు ఈ విషయం తెలియడంతో పాఠశాల వద్ద ఆందోళన చేశారు. ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఓజిలి పోలీస్ స్టేషన్లో ఉపాధ్యాయుడు అరుణ్ కుమార్, హిందీ టీచరు హరికృష్ణలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఓజిలి ఎస్సై తెలిపారు. ఈ సంఘటనపై ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రైబల్ వెల్ఫేర్ కార్యదర్శి గౌతమ్ మేనన్, వైస్ ప్రిన్సిపల్ అరుణ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ ద్వారా తెలియజేశారు.


విద్యార్థులను దండించిన వైస్ ప్రిన్స్‌పాల్ అశోక్ కుమార్, టీచర్ హరికృష్ణలను విచారిస్తున్న ఎంఆర్ఓ పద్మావతి

మాజీ సైనికుల సంక్షేమానికి సహకరించాలి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

త్రి సాయుధ దళాల పతాక దినోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించడం జరిగింది. త్రి సాయుధ దళాల పతాకాన్ని పిన్ చేయడం ద్వారా అర్మ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే హుండీ డ్రైవ్‌ను అధికారికంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సైనిక్ అధికారి కెవి. రాఘవులు స్వయంగా పర్యవేక్షించారు. మాజీ సైనిక సంఘ ప్రతినిధులు, ఎన్సీసీ అధికారులు, ఎన్సీసీ క్యాడెట్లు సైనిక్ వెల్ఫేర్ సిబ్బంది పాల్గొనడంతో కార్యక్రమం మరింత ప్రతిష్టాత్మకంగా సాగింది. కలెక్టర్ మాట్లాడుతూ దేశభద్రత కోసం త్రి సాయుధ దళాలు అందిస్తున్న సేవలు అపూర్వమని, వారి త్యాగాలను స్మరించుకోవడానికి ఫ్లాగ్ డే ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఫ్లాగ్ డే నిధులు మాజీ సైనికులు, వీరమరణం పొందిన సైనికుల కుటుంబాల సంక్షేమానికి వినియోగించబడుతాయని ప్రజలు మరింతగా సహకరించాలని పిలుపునిచ్చారు. జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి మాట్లాడుతూ త్రి సాయుధ దళాలు దేశ గర్వకారణమని కుటుంబాలను నిలబెట్టడానికి సమాజం నుంచి అందుతున్న సహకారం అమూల్యమని అభిప్రాయపడ్డారు. ఈకార్యక్రమం అనంతరం హుండీ డ్రైవ్‌ను జిల్లాలోని అన్ని విభాగాలు, సంస్థలు, విద్యాసంస్థల వరకు విస్తరించనున్నట్టు సైనిక్ వెల్ఫేర్ కార్యాలయం అధికారులు తెలిపారు.



అత్యంత వైభవంగా ఆత్మీయ అభినందన సభ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్, గురజాల జగన్ మోహన్

ప్రజాశక్తి- ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు, సభ్యుల ఆత్మీయ అభినందన సభ అత్యంత వైభవంగా దేవస్థానం అతిథి గృహం వద్ద నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి డాక్టర్ హరిప్రసాద్, వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా చైర్మన్ హేమలత, కాణిపాకం దేవస్థానం చైర్మన్ మణి నాయుడు, దేవస్థానం ఈవో పెంచల కిషోర్, బోర్డు సభ్యులు నియోజకవర్గ ముఖ్య నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కురబల అభివృద్ధి పై చంద్రన్న దృష్టి: మంత్రి సవిత

- పాల కలశాలతో ఊరేగింపు
- కనకదాస విగ్రహానికి పాలాభిషేకం చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- వి కోట

రాష్ట్రంలోని కురబల అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టి సారించారని రాష్ట్ర మంత్రి సవిత తెలిపారు. మండల కేంద్రమైన వికోటలో ఆదివారం నిర్వహించిన కనకదాసు జయంతి మహోత్సవ కార్యక్రమానికి మంత్రి సవిత, స్థానిక ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎగువ చెక్‌పోస్ట్ నుండి లాంగ్ బజార్ మీదుగా పెద్దఎత్తున కురబ మహిళలు పాల కలిశాలను తలపై ఉంచుకొని సాంస్కృతిక కార్యక్రమాల నడుమ పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో అమర్నాథ్ రెడ్డి మంత్రి సవిత పాల్గొనడంతో అభిమానులు రెట్టింపు ఉత్సాహంతో అంబేద్కర్ కూడలిలో నెలకొల్పిన భక్త కనకదాస విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భక్త కనకదాస విగ్రహానికి మహిళలు, ప్రజాప్రతినిధులు పాలాభిషేకం నిర్వహించారు. కనకదాస విగ్రహానికి పూలమాలలు సమర్పించి ప్రజలకు వారు అభివాదం చేశారు. అనంతరం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి సవిత కుటుంబంతో తమ కుటుంబానికి ఉన్న సాన్నిహిత్యాన్ని తెలియజేశారు. కురబలు నమ్మకానికి ప్రతీకని తెలుగుదేశం పార్టీ పుట్టినప్పటి నుండి పార్టీ మనుగడకు ఎంతగానో కురబలు దోహదపడుతున్నారని కొనియాడారు. కురబల సంక్షేమాన్ని గుర్తించి నియోజకవర్గంలో రాష్ట్రస్థాయి కురబ సంక్షేమ డైరెక్టర్ పదవిని కేటాయించి వారి ఉన్నతికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్రంలో తన తండ్రి కాలం నుండి నేటి వరకు దాదాపు 14మంత్రి పదవులను తెలుగుదేశం ప్రభుత్వం కురబలకు అందించడం గర్వకారణమని అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కురుబల సంక్షేమానికి అనేక విధాల సహకరిస్తున్నారని కొనియాడారు. ప్రతి ఒక్క కురబ విద్య, రాజకీయ, ఆర్థిక రంగాల్లో మెరుగైన స్థానాలకు చేరుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. అంది వచ్చే ప్రతి అవకాశాన్ని కురబలు సద్వినియోగం చేసుకూని అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. కర్ణాటక రాష్ట్ర మాజీ మంత్రి వర్తూరి ప్రకాష్ కురబల ఐక్యతను వారి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. అనంతరం కురబలు తమ సాంప్రదాయ పద్ధతిలో తలపై టెంకాయలు కొట్టే కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. మొట్టమొదటిసారి వి కోటకు విచ్చేసిన మంత్రిలను కురబలు, స్థానిక తెలుగుదేశం పార్టీ నేతలు ఘనంగా సన్మానించారు. మండల కురబ సంఘం అధ్యక్షులు ఎంసీ క్రిష్ణప్ప, ప్రధాన కార్యదర్శి అమర్ గౌడ్, స్థానిక నేతలు రామచంద్ర నాయుడు, రంగనాథ్, రాంబాబు, ఈశ్వర్ గౌడ్, ధీరజ్ పాల్గొన్నారు.


పాల కళాశాల శోభాయాత్రలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి సవిత



అంతర్రాష్ట్ర నేరస్తుడు అరెస్టు


అంతర్రాష్ట్ర నేరస్తుడిని అరెస్టు చేసి చూపుతున్న పోలీసులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వరుస అత్యాచారాలు, హత్యాయత్నాలు, డ్రగ్స్ అక్రమ వ్యాపారంలో నిందితుడైన మోస్ట్ వాంటెడ్ అంతర్రాష్ట్ర నేరస్తుడిని గుడిపాల పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. యువతులను, భయభ్రాంతులకు గురిచేసి, బలవంతపు అపహరణ చేసి లైంగిక దాడులకు పాల్పడేవాడు. పెప్పర్ స్ప్రే, ఇనుప రాడ్ వంటి ప్రమాదకర ఆయుధాలతో దాడులు చేస్తాడు. గంజాయి, డ్రగ్స్ అక్రమ వ్యాపారస్తుల నుంచి నెల మామూలు వసూలు, బెదిరింపులు, సెటిల్మెంట్లు వంటివి నిర్వహిస్తూ ఉంటాడు. అంతర్రాష్ట్ర నేరస్తుడు జాన్ అలెగ్స్‌పై తమిళనాడు రాష్ట్రంలో 50కి పైగా కేసులు, చిత్తూరులో 1 కేసులు ఉన్నాయి. 2025వ సంవత్సరం డిసెంబర్ 3న గుడిపాల పోలీస్ స్టేషన్‌లో గుడిపాల మండలం అనుపు ఎస్టీ కాలనీకి చెందిన ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అలెక్స్ అనే వ్యక్తిపై అత్యాచారం కేసుతో పాటు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం జరిగింది. దర్యాప్తులో భాగంగా గాయపడిన బాధితురాలిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చిత్తూరు సబ్ డివిజన్ డీఎస్పీ సాయినాథ్, వెస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ నాయుడు, గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ సిబ్బంది సంయుక్తంగా చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు తొమ్మిదిన్నపాలెం క్రాస్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. 2010 సంవత్సరంలో తొలి నేరంతో జైలుకు వెళ్లిన నిందితుడు అప్పటి నుంచి దొంగతనాలు, రాబరీలు, దారిదోపిడీలు, హత్యలు, హత్యాయత్నాలు, గంజాయి, డ్రగ్స్, కొట్లాట కేసుల్లో పాల్గొంటూ కరుడుగట్టిన నేరస్తుడిగా మారాడు. కాట్పాడి పోలీస్ స్టేషన్‌లో ఇతనిపై రౌడీషీట్ కూడా ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. 2018లో గ్యాంగ్ వార్ నేపథ్యంలో హత్యాయత్నం నుంచి తప్పించుకున్న ఇతడు నాలుగు రోజులకే ప్రత్యర్థి గ్యాంగ్‌కు చెందిన వ్యక్తిని హతమార్చాడు. ప్రస్తుతం ఇతనిపై తమిళనాడు రాష్ట్రంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో 50కు పైగా కేసులు, చిత్తూరు జిల్లాలో ఒక కేసు ఉన్నట్లు నిర్ధారణ అయింది. 2023లో జైలు నుంచి విడుదలైన తరువాత, పోలీసుల నుంచి తప్పించుకునేందుకు గుడిపాల మండలానికి చేరుకున్న ఇతడు, అనుపు ఎస్టీ కాలనీకి చెందిన దీపక్ కుటుంబంతో పరిచయం పెంచుకొని, అతని కుమార్తెపై బలవంతపు ప్రేమపేరుతో బెదిరింపులకు పాల్పడి, అడవిలోకి తీసుకెళ్లి గత సంవత్సరం కాలంగా అత్యాచారాలకు పాల్పడినట్టు వెల్లడైంది. కరుడుగట్టిన నేరస్తుడిని ప్రాణాలకు తెగించి పట్టుకున్న గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ప్రత్యేకంగా అభినందించారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: 25వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని విద్యార్థిని, విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు శుక్ర, శని వారాల్లో వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. చిత్రలేఖనం, చదరంగం, షాట్స్, జానపద నృత్యాలు, అభ్యుదయ గీతాలు, డిబేట్ వంటి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేవివి జిల్లా కార్యదర్శి రెడ్డప్ప, జర్నలిస్ట్ కే నేతాజీలు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 13 14 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్ఎఫ్ఐ 25వ మహాసభలు తిరుపతి, కచ్చపి ఆడిటోరియంలో జరుగనున్నాయని తెలిపారు. మహాసభను జయప్రదం చేయడానికి, వివిధ సాంస్కృత కార్యక్రమాలు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను చాటి విజేతలుగా నిలవాలని కోరారు. మహాసభలను జయప్రదం చేయడానాకి విద్యార్థిలోకం కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేవివి జిల్లా కార్యదర్శి రెడ్డప్ప, జర్నలిస్ట్ నేతాజీ



కేక్ కట్ చేస్తున్న టిడిపి యువనాయకుడు హరీష్ యాదవ్

ఘనంగా టిడిపి నాయకుడు పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల కేంద్రంలో టిడిపి యువ నాయకుడు హరీష్ యాదవ్ పుట్టిన రోజు వేడుకలు టిడిపి నాయకుల, అభిమానుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర నెల్లూరు అల్లి యల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి గంగాధర నెల్లూరు కూడలిలో ఏర్పాటు చేసిన భారీ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అభిమానులు, టిడిపి నాయకులు హరీష్ యాదవ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. 500 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణమ నాయుడు, మండల అధ్యక్షుడు స్వామిదాస్, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి కోదండ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మోహన్ నాయుడు, సింగిల్ విండో డైరెక్టర్లు జ్యోతి యాదవ్, చిన్న, పెనుమూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరుల్ నాదన్, టిడిపి నాయకులు ఇందిరమ్మ, నియాజ్ అలీ, వినోద్ నాయుడు, శేఖర్, బుల్లెట్ రాజా, ప్రకాష్, మురళి యాదవ్ పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.



నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

వైసిపి వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా అయ్యవారప్ప

ప్రజాశక్తి -గుడుపల్లి: కుప్పం నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా గుడిపల్లి మండలం పిబి వాడ పంచాయతీ గుడి కొత్తూరుకు చెందిన అయ్యవారప్ప నియమితులయ్యారు. వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి, చిత్తూరు ఎమ్మెల్సీ, వైసీపీ కుప్పం ఇన్‌ఛార్జి భరత్ తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి, పార్టీ అభివృద్ధి కోసం మరింత కష్టపడి పని చేస్తానని అయ్యవారప్ప పేర్కొన్నారు.



మాట్లాడుతున్న పెన్షనర్స్ యూనియన్ నాయకులు

సమస్యలపై స్పందించండి..

ప్రభుత్వానికి పెన్షనర్ల వినతి

ప్రజాశక్తి- పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరులో ఆదివారం ఉదయం 10 గంటలకు పెన్షనర్ల భవనంలో రాష్ట్ర పెన్షనర్ల సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పెన్షనర్ల ఆర్థిక ఆరోగ్య సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని పలువురు పేర్కొన్నారు. నూతన సంవత్సర డైరీలు, ఫ్లాగ్ డేలు ఈ నెల 17వ తేదీ నిర్వహించే "జాతీయ పెన్షనర్ల దినోత్సవం"పై చర్చించారు. ఈ కార్యక్రమంలో పెన్షన్ల సంఘం అధ్యక్షుడు రత్నారెడ్డి, సెక్రటరీ గురుమూర్తి, ఇతర సంఘ సభ్యులు పాల్గొన్నారు.



కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టరు

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని ప్రజలకు ఆరోగ్య సేవలను అందించేందుకు పలమనేరు రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు ఎం ప్రభాకర్ చొరవతో, ప్రతి నెల మొదటి ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పలమనేరు బస్టాండ్ వద్ద వున్న రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేశారు. చెన్నై శంకర్ నేత్రాలయ ఆసుపత్రి నుండి వచ్చిన వైద్య సిబ్బంది మురళి బృందం ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి నియోజక వర్గంలోని వివిధ గ్రామాల నుండి కంటి సమస్యలతో బాధపడుతున్న 45 మంది హాజరయ్యారు. వైద్యులు వారిని క్షుణ్ణంగా పరిశీలించగా, కంటి ఆపరేషన్ అవసరమున్న 25 మందిని గుర్తించారు. వీరికి చెన్నై శంకర నేత్రాలయ ఆసుపత్రిలో బుధవారం ఉచితంగా ఆపరేషన్ చేయించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు ఏం ప్రభాకంర్ మాట్లాడుతూ ఎంపికైన రోగులను హాస్పిటలకు తీసుకెళ్లడం, ఆపరేషన్ అనంతరం ఇంటికి చేర్చే వరకు అంతా ఉచితమే అన్నారు. అంతేకాక, శిబిరానికి వచ్చిన ప్రజలకు, వైద్యులకు ఉచిత భోజనం అందించారు.

పరిమిత బస్ సర్వీసులు

- కనిపించని బెంగుళూరు బస్సులు
- వారాంతంలో ప్రయాణికుల అగచాట్లు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు నుండి బెంగళూరుకు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి బస్సులు స్వీసులు లేక రోడ్డుపైనే నిరీక్షించారు. నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదివారం కావడంతో వారాంతపు సెలవుల కోసం ఇళ్లకు వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తిరిగి బెంగళూరులో ఉద్యోగాలకు వెళ్లాల్సి ఉండడంతో బస్సులు లేక పోవడంతో, నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ఎక్కువగా తిరుపతి, చిత్తూరు నుండి వచ్చే బస్సుల్లో ప్రయాణికులు అక్కడే నిండిపోవడంతో ఆ బస్సులు పలమనేరు మీదుగా రాక పోవడంతో, బైపాస్‌లలో వెళ్లి పోవడంతో, ఒకటో రెండో వచ్చిన బస్సుల్లో సీట్లు లేక నిండిపోవడంతో బెంగళూరు వైపు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు లోన వుతున్నారు. ఆర్‌టిసి అధికారులు తగు చర్యలు తీసుకుని వారాంతపు సెలవుల్లో వచ్చి తిరిగి బెంగళూరుకు వెళ్లే ఉద్యోగుల కోసం ఇం ఇంకా అదనంగా బస్సులు వేయాలని పలువురు అభ్యర్థిస్తున్నారు.



బెంగుళూరు బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

వై జయమూర్తికి డాక్టరేట్



ప్రజాశక్తి -గుడిపల్లి: ద్రావిడ విశ్వ విద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో వై జయమూర్తికి డాక్టరేట్ లభించింది. గత నెల 26వ తేదీ కంప్యూటర్ సైన్స్ విభాగంలోని మైనింగ్ వెబ్ ఒపీనియన్ సోర్స్ యూసింగ్ మిషన్ లెర్నింగ్' అనే అంశంపై డాక్టరేట్ పొందారు. రెగ్యులర్ రీసెర్చ్ చేస్తూ ఈ డాక్టరేట్ పొందారు. గుడిపల్లి మండలానికి చెందిన యమూర్తి సామాన్య కుటుంబంలో జన్మించి పిహెచ్‌డి చేయడం గర్వకారణంగా వుందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.



మంజూను అభినందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

వైసీపీ కమిటీలు ఏర్పాటు

ప్రజాశక్తి- గుడిపల్లి: గుడిపల్లి మండల పరిధిలో పంచాయతీలలో వైసీపీ నూతన కమిటీలు ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా పెద్ద భజన వాడ పంచాయతీ వైసిపి అధ్యక్షుడిగా మంజు నియమితులయ్యారు. యూత్ ప్రెసిడెంట్‌గా గజేంద్రను నియమించారు. త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ క్యాడర్‌ను సన్నద్ధం చేయడంలో భాగంగా పంచాయతీల వారీగా నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. నూతనంగా ఎన్నికైన వారిని ఎమ్మెల్సీ భరత్ అభినందించారు.



మాట్లాడుతున్న జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్‌యాదవ్

మాజీ సీఎం జగన్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

శ్రీధర్ యాదవ్ డిమాండు

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి యాదవులను కించపరిచేలా మాట్లాడారని ఆయన యాదవ సామాజిక వర్గానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం గంగాధరనెల్లూరులో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాదవ బీసీ కులానికి చెందిన ఐఎఎస్ అధికారిని వాడు వీడు అని సంబోధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలోని వివిధ పార్టీలకు బీసీ లు బలమైన వర్గానికి చెందినవారుగా ఉన్నారని వారిని అలా సంబోధించడం సబబు కాదన్నారు. జగన్ మోహన్ రెడ్డి వెంటనే యాదవులకు క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ జ్యోతి యాదవ్, మండల టిడిపి బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మురళి యాదవ్, ఆవుల గోపి యాదవ్, యాదవ్ సాధికార మహిళ అధ్యక్షురాలు గాయత్రి, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ లోకమ్మ , మండల టిడిపి మహిళా అధ్యక్షురాలు భువనేశ్వరి, పాల్గొన్నారు.



వెంకటేశ్వర స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

ఘనంగా శ్రీవారి కల్యాణం

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల సమీపంలోని వెంకటేశ్వరస్వామి వారి పాదాల వద్ద శ్రీ భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణపతి హోమం, కలశ స్థాపన చేసి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఆశీనులయ్యారు. అనంతరం వేదమంత్రాల నడుమ 10 గంటల నుండి 12 గంటల వరకు తిరు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేసి భక్తులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్వేత, ప్రదీప్ కుమార్, అర్చకులు పాగొండ మోహన్, వేణుగోపాల్, లక్ష్మీప్రసాద్, శేఖర స్వామి పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న జిల్లా బోధనేతన ఉద్యోగుల సంఘ సభ్యులు

విద్యాశాఖ బోధనేతర ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులుగా డి కుమార్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖ బోధనేతర ఉద్యోగులు, సిబ్బంది ఎన్నికలు ఆదివారం స్థానిక ఏపీ ఎన్జీవో కార్యాలయంలో ప్రశాంతంగా నిర్వహించారు. ఈ ఎన్నికలకు నిర్వహణాధికారిగా నెల్లూరు జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు కే రాజేంద్రప్రసాద్, సహాయ ఎన్నికల అధికారిగా నెల్లూరు జిల్లా యూనియన్ అసోసియేట్ అధ్యక్షులు ఏవీ సురేష్ వ్యవహరించారు. ఎన్నికల పరి శీలకులుగా నెల్లూరు జిల్లా సంఘం కార్యదర్శి ఎస్ సురేష్ హాజరయ్యారు. ఈ క్రమంలో 16 కార్యవర్గ ప్రతినిధుల స్థానాలతో పాటు, 4 కార్యవర్గ సభ్యుల స్థానాలకు ఒక్కో నామినేషన్ మాత్రమే నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో కార్యవర్గ పదవులన్నీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

నూతన కార్యవర్గం

ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖ బోధనేతర ఉద్యోగులు, సిబ్బంది అసోసియేషన్ అధ్యక్షులుగా చిత్తూరు జిల్లా విద్యా శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ డి కుమార్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్ రామ్ కుమార్, ఉపాధ్యక్షు లుగా ఎం రమేష్, ఎస్ నాగరాజ, ఎస్ రెడ్డిశేఖర్, ఎస్ఏ రహమత్ బాష, ఎన్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా బి చైతన్య, కార్యనిర్వాహక కార్యదర్శిగా సి బాలాజీ, కార్యదర్శు లుగా షమాసుల్తాన్, జి రేణుకాపతి, జీబీ తులసీరామ్, బి దీపిక, కె రాజేష్, మహిళా కార్యదర్శిగా ఐ కృపావతి, కోశాధికారిగా ఎన్ గోపాల్‌తో పాటు, కార్యవర్గ సభ్యులుగా ఎస్ రవిశేఖర్, టీజే యువరాజ్, టీ సాయి ప్రశాంతి, వి మునిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కాణిపాకం బోర్డు సభ్యుడిగా కత్తి సుధాకర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-తవణంపల్లె: తవణంపల్లి మండ లం సరకల్లు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, ఎంపీటీసీ కత్తి సుధాకర్ రెడ్డి కాణిపాక దేవస్థానం బోర్డు మెంబర్‌గా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై ఆయన కు శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. పదవీ స్వీకారోత్సవంలో కత్తి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ పదవి రావడం తన జీవితంలో ఎంతో ఆనందకరమని, తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన ఎమ్మెల్యే మురళీ మోహన్‌కు, మండల అధ్యక్షుడు వెంకటేశ్ చౌదరికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపా రు. స్వామి సేవ చేయడం తనకు దక్కిన గొప్ప అదృష్టమని, భక్తి, నిబద్ధత తో పనిచేస్తూ ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తాను' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కన్వీనర్ ప్రవీణ్ నాయుడు, కత్తి సతీష్ రెడ్డి, గిరి నాయుడు, సునీల్ నాయుడు తదితర నాయకు లు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేసిన కత్తి సుధాకర్‌రెడ్డి

నాణ్యమైన వైద్యసేవలే ధ్యేయం

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ ఫౌండేషన్ ధ్యేయమని మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు పేర్కొన్నారు. మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మహతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆధునిక కుప్పం పీఏసీ వైద్య బృందంతో కలిసి ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరానికి ఉదయం నుంచే రోగులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. మొత్తం 125 మంది వైద్య సేవలు పొందారు. ప్రజలకు అవసరమైన అన్ని విభాగాల్లో చికిత్సలు అందుబాటులో ఉండటం విశేషం. పరిశీలించిన వారిలో 20 మందిని మెరుగైన చికిత్స కోసం కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు. ఐదుగురికి మెడిసిన్, ఎనిమిది మందికి ఆర్థో, నల్గురికి సర్జరీ, ఇద్దరికి ఆప్తాల్మాలజీ, ఒకరికి యూరాలజీ సంబంధిత ప్రత్యేక చికిత్సలు పొందాలని వైద్యులు సూచించారు. ఈ సందర్భంగా మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అనారోగ్యంతో బాధపడే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం తమ ఫౌండేషన్ ధ్యేయం అన్నారు. ఈ శిబిరానికి అధిక సంఖ్యలో ప్రజలు రావడం తమకు సంతోషంగా వుందన్నారు. అవసరమైన వారికి ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తి స్థాయిలో ఉచిత చికిత్స అందిస్తామని తెలిపారు. రోగులను ఈ నెల 9వ తేదీ మంగళవారం ప్రత్యేక వాహనంలో ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. 'గ్రామీణ ప్రజలకు ఇలాంటి శిబిరాలు నిజంగా వరం లాంటివని, వైద్యులు ఎంతో సేవా భావంతో ప్రజలను పరిశీలించి వైద్య సేవలు అందించిన అందరికీ అభినందనలు తెలిపారు. వైద్య శిబిరంలో పనిచేసిన పిఇఎస్ డాక్టర్ల బృందం, అమెరికాలో ఉన్న మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు, సహాయక మేనేజర్ శ్రీనివాసులు, సభ్యుల సేవాభావం ప్రశంసనీయమని స్థానికులు కితాబిచ్చారు. శిబిరానికి హాజరైన వారికి డాక్టర్ల బృందానికి ఆపాలని చేరుకున్న వారికి మహతి ఫౌండేషన్ సహకారంతో పూజిత భోజనం అందించారు.



శస్త్ర చికిత్స కోసం ఎంపికైన రోగులతో వైద్య బృందం

ఉపాధ్యాయ సంఘం ఎన్నిక

ప్రజాశక్తి-రొంపిచర్ల : ఎస్‌టియు రొంపిచెర్ల మండల శాఖ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికలలో మండల శాఖ అధ్యక్షులుగా సి సదాశివ రెడ్డి ,ప్రధాన కార్యదర్శిగా షాన్వాజ్ ,ఆర్థిక కార్యదర్శిగా గంగాధర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో వివిధ పదవులకు ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లోకనాథ రెడ్డి, పోతిరెడ్డి రమణారెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, అరవ వేణుగోపాల్ రెడ్డి , డాక్టర్ జనార్ధన రెడ్డి, మోహన్ కుమార్ రెడ్డి, జాఫర్ , సదాశివ రెడ్డి,మహ్మద్ షాన్వాజ్, భాస్కర్ రెడ్డి, క్రిష్ణయ్య,మదన మోహన్ రెడ్డి, బాల వెంకట్రమణ, పెనుబాకు గంగాధర పాల్గొన్నారు.

ఎస్ఐ ధర్మారెడ్డి సేవలు అమూల్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండల పోలీస్ స్టేషన్ ఎస్సైగా గత ఐదేళ్లుగా పనిచేస్తూ, రేణిగుంటకు బదిలీపై వెళ్తున్న ఎస్సై ధర్మారెడ్డికి నూతన ఎస్సై హరీష్, పోలీస్ సిబ్బంది, స్థానిక నాయకులు, ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భగా ధర్మారెడ్డిని ఘనంగా సత్కరించారు.

గంధ మహోత్సవంలో అన్నదానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గేట్ పుత్తూరు, అనంబట్టు రోడ్డు, ఖాదర్ వలి దర్గాలో మహమ్మద్ నబి ఆధ్వర్యం లో శుక్రవారం నుండి నిర్వహిస్తున్న గంధ మహో త్సవం ఆదివారంతో ముగి సింది. ఈ సందర్భంగా సుమారు వెయ్యి మందికి పైగా అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో పుత్తూరు పట్టణ ప్రధాన కార్యదర్శి యన్‌యన్ ధనపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ డియస్ గణేష్, చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి మహమ్మద్ నబి, పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, బావాజీ, వసీమ్, శంసు, కరీం అలీషా, అమీర్ జాన్, యాక్బుల్, రహీమ్ పాల్గున్నారు.

ఆకట్టుకున్న నృత్య, కళా పోటీలు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ రెండవ దశ అంతర కళాశాల క్రీడా సాంస్కృతిక పోటీలలో భాగంగా మూడవరోజు జరిగిన నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం రెడ్డి శేఖర్ తెలిపారు. షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చదరంగం వంటి విభాగాలలో విద్యార్థిని, విద్యార్థులు పోటీపడి తమ ప్రతిభను కనబరిచారు. ఉదయగిరి వ్యవసాయ కళాశాల 100 మీటర్ల పరుగు పందెంలో తాడిపత్రి వ్యవసాయ కళాశాల, 200 మీటర్ల పరుగు విభాగంలో ఎస్వీ వ్యవసాయ కళాశాల విజేతలుగా నిలవడం జరిగిందని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రవికాంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థి వ్యవహారాల ఇంచార్జ్ డాక్టర్ కే హరిప్రసాద్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా పార్కింగ్..
తప్పని ట్రాఫిక్ తిప్పలు

ప్రజాశక్తి - పుత్తూరుటౌన్ : పుత్తూరు పట్టణంలోని తిరుపతి రోడ్డులో ఇటీవల నూతనంగా ప్రారంభమైన కాసం ఫ్యాషన్ షోరూం వద్ద నిర్లక్ష్యంగా ద్విచక్రవాహనాలు పార్క్ చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. షోరూమ్ ముందు విచ్చలవిడిగా వాహనాలు నిలిపేయడంతో విద్యార్థులకు, పాదచారులకు, వాహనదారులకు, ముఖ్యంగా 108 అంబులెన్స్ రాకపోకలకు పెద్ద ఎత్తున ఆటంకం కలుగుతోంది. పార్కింగ్ సమస్య గురించి షోరూం యాజమాన్యాన్ని నివాసితులు ప్రశ్నించినప్పటికీ, తమకు ఎటువంటి సంబంధం లేదనే నిర్లక్ష్య సమాధానం వస్తోంది. షాపింగ్ హడావిడితో ఆ ప్రాంతమంతా రద్దీగా మారిపోగా, బాధపడేది మాత్రం ప్రజలేనంటూ స్థానికులు విమర్శిస్తున్నారు. ఇకనైనా ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు తక్షణమే జోక్యం చేసుకొని, రహదారి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రద్దీ ప్రాంతంలో నిర్లక్ష్య పూర్వక పార్కింగ్ కొనసాగితే ఏ క్షణంలోనైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యానగర్‌లో రక్తదాన శిబిరం


ప్రజాశక్తి -కోట : రక్తదానం చేద్దాం.. ప్రాణదాతలు అవుదామని ఎంవీ.రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం కోట మండలం, విద్యానగర్‌లో విద్యా ప్రదాత స్వర్గీయ ముప్పవరపు వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మిల జ్ఞాపకార్థం ఎం.వి.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిస్టర్ కార్ వాష్ సెంటర్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మేడిపల్స్ రక్తనిధి కేంద్రం ఇంచార్జ్ ఎం.సురేష్, పలగాటి సాయి రెడ్డి ప్రారంభించారు. ముందుగా ముప్పవరపు వెంకటేశ్వర రావు, ముప్పవరపు ఆదిలక్ష్మి చిత్రపటాలకు పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. డిసెంబర్ 7 న భారత సైనిక దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని, దేశవ్యాప్తంగా ఉన్న భారతదేశ సైనికులకు కొవ్వొత్తులు వెలిగించి నివాళు లర్పించారు. అనంతరం రక్తదాతల నుంచి గూడూరు పట్టణానికి చెందిన మేడి పల్స్ రక్తనిధి కేంద్రం వారు రక్తాన్ని సేకరించారు. రక్తదాతలకు సర్టిఫికేట్‌తో పాటు మెడిపల్స్ కిట్, జ్యూస్, పండ్లు, బిస్కెట్‌తో పాటు ప్లాస్కోను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం.విజయలక్ష్మి, వేమారెడ్డి షనీల్ రెడ్డి,పలగాటి సాయిరెడ్డి రక్త దాతలు మెడిపల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ సంస్థాగత కార్యదర్శిగా తిరువేంగడం

ప్రజాశక్తి - పిచ్చాటూరు, పుత్తూరు: తిరుపతి జిల్లా వైసీపీ సంస్థాగత కార్య దర్శిగా నారాయణవనం మండలం, తిరువట్యం పంచాయతీకి చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు తిరువేంగడంను వైసిపి అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు పార్టీ అధిష్టానానికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఎస్‌టియు జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విజయం విద్యా సంస్థలలో ఆదివారం నిర్వహించిన ఎస్‌టియు 79వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్ను కున్నారు. ఈ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎస్‌టియు చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్షులుగా రెండవసారి ఎన్ఆర్ మదన్ మోహన్ రెడ్డి, జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శిగా ఇలియాస్ బాషా, ఆర్థిక కార్యదర్శిగా పురుషోత్తం, గౌరవ అధ్యక్షులుగా పీతాంబర రాజు, రాష్ట్ర కౌన్సిలర్లుగా గంటా మోహన్, పురుషోత్తం , దేవరాజులు రెడ్డి, చంద్రన్, చంద్రశేఖర్ నాయుడు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా కమలాపతి, బొబ్బిలి రెడ్డి జిల్లా అదనపు కార్యదర్శు లుగా కిషోర్ కుమార్ రెడ్డి, సుల్తాన్, జిల్లా ఉపాధ్యక్షులుగా రాజేష్ కుమార్ గణపతి, కోదండయ్య, కుమార్, సుబ్రహ్మణ్యం, రాజేష్ కుమార్ స్వామి రెడ్డి, జిల్లా మహిళా కన్వీనర్‌గా రాధా కుమారి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా హరి ప్రసాద్ రెడ్డి, ఎన్నికల పరిశీల కులుగా బాల గంగిరెడ్డి వ్యవహరించారు. అనంతరం ఎన్నికైన సభ్యులందరూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా మని ప్రమాణం చేశారు. ఎన్నికైన నూతన కార్య వర్గానికి ఎస్‌టియు నాయ కులు అభినందనలు తెలిపారు.



జిల్లా ఎస్‌టియు కార్యవర్గ సభ్యులు

తెలుగు మాధ్యమం కొనసాగించాలి

రాష్ట్రంలో తెలుగు మాధ్య మాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసు కోవాలని ఎస్‌టియు చిత్తూరు జిల్లా శాఖ కౌన్సిల్ సమావేశం డిమాండ్ చేసింది. ఆదివారం చిత్తూరులో విజయం విద్యాసంస్థల ప్రాంగణంలో ఎస్టియు జిల్లా కౌన్సిల్ మహాసభ మదన్మోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమానికి తమ వ్యతిరేకం కాదని, అయితే తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే 30 శాతానికి తక్కువ కాకుండా మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రాయితీలను వివరించాలి

- గ్రామ సభలు నిర్వహించి బడుగు, బలహీన వర్గాలకు తెలపాలి
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపీపీ అమరావతి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బడుగు, బలహీన వర్గాలకు అందించే రాయితీలను గ్రామ సభల ద్వారా వివరించాలని ఎంపిపి అమరావతి పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక మండల సర్వసభ సమావేశం ఎంపిపి అమరావతి అధ్యక్షతన, ఎంపీడీవో మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అమరావతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న వసతులను తెలిపి వాటిని అభివృద్ధి దిశలో తీసుకోవాలని సూచించారు. బడుగు, బలహీన వర్గాలకు అంది స్తున్న రాయితీలను గ్రామ సభలు నిర్వచించి గ్రామాల్లో తెలిపినప్పుడే ఆ పథకానికి సార్థకత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి జెడ్పిటిసి సోమశేఖర్, తహశీల్దార్ షబ్బీర్ బాష, ఎంఈఓ నాగేశ్వరరావు, ఏవో భారతి, ఉద్యాన శాఖ అధికారి సాగరిక , పలువురు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి అమరావతి